

పిహెచ్‌డిలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎపిఆర్‌సెట్‌లో అర్హత సాధించిన జియాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో పిహెచ్‌డి ప్రవేశాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల ప్రక్రియను రిజిస్ట్రార్ జి.సుధాకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2023-24 సంవత్సరానికి జియాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లోని పిహెచ్‌డి పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు నన్నయ విశ్వవిద్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. విసి కె.పద్మరాజు ఆదేశాల మేరకు ఏర్పాటును పూర్తి చేశామని చెప్పారు. సోమవారం జియాలజీ విభాగంలో 30 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామని, అలాగే మేనేజ్‌మెంట్‌లో 320 విద్యార్థులకు 80 మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు జరిగాయని చెప్పారు. మిగిలిన విద్యార్థులకు ఈనెల 27వరకూ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

దిగిరాని ధరలు

- ఆకాశాన్నంటుతున్న కూరగాయల రేట్లు
- చికెన్, కోడిగుడ్డుదీ అదే దారి
- ఆందోళనలో కొనుగోలుదారులు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కూరగాయల ధరలు ఇంకా దిగిరావట్లేదు. రెండు వారాలుగా కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. దీంతో కూరగాయలు కొనాలంటేనే సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కొన్ని కూరగాయల ధరలు ఇప్పటికే కేజీ రూ.100కు పైగా ధర పలుకుతున్నాయి. వర్షాల కారణంగా తాజాగా ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. రూ.200 వెచ్చించినా నాలుగురకాల కూరగాయలు కూడా రావట్లేదని కొనుగోలు దారులు గగ్గోలు పెడుతున్నారు. చికెన్, కోడిగుడ్డు ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి.

జిల్లాలో వరి పంటలతో పాటు కూరగాయల సాగుపై అధిక శాతం రైతుల ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 17,500 ఎకరాల నుంచి 30వేల ఎకరాల వరకు సీజన్ ఆధారంగా కూరగాయల సాగు జరుగుతుంది. వర్షాలకు, పంట దెబ్బతినడంతో కూరగాయల కొరత ఏర్పడింది. వర్షాలకు టమోటా పంట పాడవ్వడంతో కొరత ఏర్పడింది. హోల్‌సేల్ మార్కెట్లో కిలో టమోటాకు రూ.50 లభిస్తోంది. చిల్లర వర్తకులు కిలో రూ.80 నుంచి రూ. 100 చొప్పున విక్రయిస్తున్నారు.

నెల రోజుల వ్యవధిలో ధరలు ఇలా...

కూరగాయల ధరలు నెలరోజుల్లో రెండింతలు పెరిగాయి. నెల క్రితం చిక్కుడు కిలో రూ.60కు లభించేది. ప్రస్తుతం అది రూ.120కు పెరిగింది. గోరు చిక్కుడు ధర కిలో రూ.25 నుంచి రూ.60కి, వంకాయ కిలో రూ.30నుంచి రూ.70 కి, కాకరకాయ కిలో రూ.35 నుంచి రూ.70, బెండకాయ కిలో రూ.30 నుంచి రూ.40, బీరకాయ కిలో రూ.40 నుంచి రూ.70కి, బీన్స్ కిలో రూ.40నుంచి రూ.60, క్యాప్సికం రూ.40 నుంచి రూ.100, క్యాబేజీ పువ్వు రూ.20 నుంచి రూ.60, పుదీన రూ.30 నుంచి రూ.80, కొత్తిమీర రూ.40 నుంచి రూ.120, ములక్కాడలు ఒక్కటి రూ.5నుంచి రూ.20, క్యారెట్ రూ.50 నుంచి రూ.70కు పెరిగింది. బంగాళదుంపలు కిలో రూ. 40 నుంచి రూ. 80 చేరాయి. అల్లం కిలో రూ. 400కు చేరింది. పెరిగిన ధరలు కొనుగోలుదారులకు చమటలు పట్టిస్తున్నాయి. కోడిగుడ్డు రూ.7, పప్పు దినుసులు కేజీ రూ.200 వరకు ఉన్నాయి. చికెన్ ధర కేజీ రూ.300, మటన్ రూ.1000 వరకూ ఉంది.బియ్యం సైతం 26 కేజీలు రూ.1,500 చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ధరలను నియంత్రించాలి

[illegible] కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంట్లో నెలకు కూరగాయలకు రూ.2వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తుంది. నెల రోజుల క్రితం వరకు కూరగాయల కోసం వారానికి కేవలం రూ.400 నుంచి రూ.500 వరకు ఖర్చు చేసేవాళ్లం. ఇప్పుడు రూ.700 వరకూ ఖర్చు చేయాల్సి వస్తుంది.

- కె.రామలక్ష్మి, రాజమహేంద్రవరం, కంబాల చెరువు

రైతు బజార్లలో నాణ్యతలేని కూరగాయలు

కుటుంబ పోషణ కోసం ఇంటి వద్దనే కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నా. నెల రోజుల్లో ధరలు విపరీతంగా పెరిగాయి. గతంలో రూ.15 చొప్పున కూడా ఇచ్చేవాళ్ళం. ప్రస్తుతం మరో రూ.10 పెంచాల్సి వచ్చింది. అలా విక్రయించినా గిట్టుబాటు కావడం లేదు. రైతు బజార్లో నాణ్యత లేని కూరగాయలు లభిస్తున్నాయి. హోల్‌సేల్ వ్యాపారులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసి తిరిగి మార్కెట్లలో విక్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పెరగాలి. అలాగే నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి.

- వి. రేణుక కర్రీ పాయింట్ నిర్వాహకులు, రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

యుటిఎఫ్ 50 వసంతాలను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా స్వర్ణోత్సవాలను విజయ వంతం చేద్దామని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం రాజమండ్రిలోని యుటిఎఫ్ హోమ్‌లో సోమవారం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నాలుగు రోజుల పాటు ఈ స్వర్ణోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి 15 వేల మంది ఉపాధ్యాయ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయస్థాయి వక్తల ప్రసంగాలు, మార్చ్, ప్రదర్శనలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాలంటీర్లను ఏర్పాటు చేసుకొని కార్యక్రమం విజయవంతం అయ్యేంతవరకు అన్ని జిల్లాల కార్యవర్గాలు విస్తతంగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, మహిళా అసోసియేట్ విజయగౌరి, జిల్లా కోశాధికారి ఇవివిఎస్ఆర్.ప్రసాద్ తదితరులు యుటిఎఫ్ చేస్తున్న కార్యక్రమాలను, భవిష్యత్తు కర్తవ్యాలను వివరించారు. అనంతరం 'ప్రభుత్వ బడిని పరిరక్షించుకుందాం!' గోడ పత్రికను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి పలు కరపత్రాలను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా,రాష్ట్ర యుటిఎఫ్ ప్రతినిధులు శ్రీమణి, రూపస్‌రావు, రమేష్, రవి బాబు, ప్రకాష్, చిలుకూరి శ్రీనివాసరావు, భాస్కర్రావు, మనోహర్, శ్రీనివాస్ మూర్తి, దయానంద్, భవాని, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి

ప్రజాశక్తి - తాళ్లపూడి

అందరి సహకారంతో కొవ్వూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడి మండలం మలకపల్లిలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో గల కళ్యాణ మండపంలో అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ప్రధాని మోడీ సారథ్యంలో రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు, టిడిపి మండల అధ్యక్షులు నామన



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

పరమేశ్వరరావు, టిడిపి నాయకులు మద్దిపాటి ప్రకాశం, జె.సుబ్బరాయచౌదరి, బి.వీరరాఘవులు, కొవ్వూరు నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి టివి.రామారావు, యువ గళం జిల్లా నాయకులు కాకర్ల సత్యేంద్ర పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు వల్లేపల్లి నరసింహమూర్తి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు మాట్లాడారు. రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వానికి సంఘం జిల్లా కమిటీ తరపున అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలను అందించాలన్నారు. గత ప్రభుత్వం అన్యాయంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును, పథకాలను నిలిపివేస్తూ ఇచ్చిన మెమో నెంబర్ 1214 రద్దుచేయాలన్నారు. చట్టబద్ధంగా పథకాలను తిరిగి ప్రారంభించాలన్నారు. ఐదేళ్లగా ప్రమాదవశాత్తు చనిపోయిన, అంగవైకల్యం కలిగి ఆసుపత్రి పాలై ఇబ్బందులు ఎదుర్కొన్న నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లను స్వీకరించి సంక్షేమ బోర్డు నిధి ద్వారా సాయం అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు మైగాపుల నాగేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య, జిల్లా కమిటీ సభ్యులు మాణిక్ రెడ్డి, హరిబాబు, వీరా త్రిమూర్తులు, కొమ్మన రాముడు, జెట్టి రామకృష్ణ, ఎస్‌కె.ఆదామ్, పి.వెంకటేశ్వరరావు, ఎ.రాంబాబు, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీత పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వర్షాలు ప్రారంభమైన దృష్ట్యా మురుగు కాలువల్లో పూడిక తీత పనులను వేగవంతం చేయాలని కమిషనర్ కె.దినేష్‌కుమార్ పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నగర పర్యటనలో భాగంగా మోరంపూడి రోడ్డు, వెంకటేశ్వర జనరల్ మార్కెట్ ఏరియా తదితర ప్రాంతాలను సందర్శించారు. ఎస్‌విజి.మార్కెట్ గుండా ప్రవహించే కాలువల్లో పూడికతీత పూర్తిస్థాయిలో జరుగకపోవడంతో వర్షం వచ్చినప్పుడల్లా కాలువల్లోని చెత్త రోడ్డుపైకి వస్తునట్టు గుర్తించారు. కొంత మాత్రమే నగరపాలక సంస్థకు చెందుతుందని, మిగిలిన భాగము పిడింగొయ్యి గ్రామపంచాయతీలో ఉన్నందున పంచాయతీ సెక్రటరీని పిలిచి వెంటనే కాలువ పూడిక తీతపనులు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.పాండురంగారావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.వినూత్న, పిడింగొయ్యి పంచాయతీ సెక్రటరీ శ్రీరూప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వి.అప్పలరాజు తెలిపారు. సోమవారం చివటం గ్రామంలో టీచర్స్ కాలనీ వద్ద తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు అవగాహన కల్పించారు. బండికి సంబంధించిన పత్రాలను ఎప్పుడూ వెంట పెట్టుకోవాలన్నారు. సరైన పత్రాలు లేకుండా, హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహన చోదకులకు జరిమానాలు విధిస్తున్నట్లు చెప్పారు.

డయేరియా నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో డయేరియా నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులకు సూచించారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు జిల్లా స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం అమలుపై సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరం జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. జిల్లాలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు సమన్వయ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఒఆర్ఎస్, జింక్ సప్లిమెంటరీ అందించాలన్నారు. శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత, శుద్ధమైన తాగునీరు, అనుబంధ శాఖల, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మలేరియా, డెంగీ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో తప్పకుండా రోజువారి మంచినీటి శాంపిల్స్ తీసుకొని పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిటీ స్థాయి కార్యకలాపాల వివరాలు తెలియజేశారు. ఈ సమావేశంలో జెసి ఎస్.తేజ్‌భరత్, డిఆర్‌ఒ జి.నరసింహులు, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్‌పి.పద్మశ్రీ, డిఐఒ డాక్టర్ ఎన్.రాజకుమారి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

గోపాలపురం : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, డయేరియా పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపిడిఒ కె.రమేష్ పలు శాఖల అధికారులకు సూచించారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో పిహెచ్‌సి వైద్యులు, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయం, పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, డయేరియా ప్రబలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ జి.రాజమనోహర్, అన్నదేవరపేట పిహెచ్‌సి వైద్య అధికారి నవ్యశ్రీ, హుకుంపేట పిహెచ్‌సి వైద్య అధికారి బివివి.దుర్గాభవాని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ బంగారయ్య తదిరులు పాల్గొన్నారు.

గోకవరం : మండలంలోని కొత్తపల్లి పిహెచ్‌సిలో డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. అంటువ్యాధులు ప్రబలితే వెంటనే మెడికల్ ఆఫీసర్‌కు తెలియజేయాలన్నారు. నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు. హాస్టల్స్‌లో దోమల మందులు పిచికారీ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి డిఎన్.మూర్తి, శంకర్ హెచ్‌వి.రాజేశ్వరి, అరుణోనమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కృష్ణప్రసాద్ అధ్యక్షతన డయేరియా వ్యతిరేక మాసోత్సవాలపై పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బందికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఎంపిడిఒ కృష్ణ ప్రసాద్, మండల వైద్యాధికారులు డాక్టర్ రాజు, డాక్టర్ చైతన్య డయేరియాపై అవగాహన కల్పించారు. అనంతరం సీతానగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఉండ్రాజవరం : అంటువ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంపై సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడారు. డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. బయట దొరికే తినుబండరాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే మినరల్ వాటర్ ప్లాంట్‌లను నిత్యం తనిఖీ చేయాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.నవీన్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ భవాని, ఆయాశాఖల ఎఒలు, ఎఇలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చాగలు : మండలం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నాతి బుజ్జి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం జరిగిందని బ్రాహ్మణగూడెం వైద్యాధికారి డాక్టర్ కె.నిశిత తెలిపారు. ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేసి వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. డయేరియా ప్రబలకుండా చూడాలన్నారు. ఎక్కడైనా డయేరియా ప్రబలితే వెంటనే వైద్యాధికారికి సమాచారం తెలియజేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పిఆర్ఎల్.దేవి, కె.చంద్రబాబు, శ్రవణ్‌కుమార్, వి.పద్మ, ఎ.రామచంద్రరావు, ఎస్.సారమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై తీర్మానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వర్షాకాలంలో గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూర్యారావుపాలెం పంచాయతీ సాధారణ సమావేశంలో తీర్మాణం చేశారు. ఈ సమావేశం సోమవారం సర్పంచ్ మెండే లలితకుమారి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి, కొణిదల పవన్‌కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లకు సమావేశం శుభాకాంక్షలను తెలిపింది. కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటంతో పాటు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, దుర్గేష్ చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నందిన శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు పెదపోలు వెంకటలక్ష్మి, ఆచంట సాయిరాం, వేమన శ్రీనివాసరావు, కోటిపల్లి వెంకటేశ్వర్లు, రుద్ర ధననరసింహారావు, డేవిడ్‌రాజు, ప్రసాదు, రవి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. రాష్ట్రం వ్యాప్తంగా శానిటేషన్, ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఫస్ట్ అబ్జక్ట్స్ సంస్థ ద్వారా జీతాలు చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి డబ్బులు తీసుకొని సొంతప్రయోజనాలకు వాడుకుంటూ కార్మికులకు నెలలు తరబడి జీతాలు చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ మొత్తాలను కార్మికుల ఖాతాలకు జమచేయట్లేదన్నారు. 6 నెలలు నుంచి జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వెంటనే జీతలు చెల్లించేలా చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టిఎన్‌యుఎస్ రాష్ట్ర కార్యదర్శిగా జయరాజు

ప్రజాశక్తి- కడియం

తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శిగా జయరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టిడిపి రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో ప్రతినిధుల సమావేశంలో జయరాజు పేరును రాష్ట్ర అధ్యక్షులు మన్నమ్ శ్రీనివాస్ ప్రతిపాదించారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జయరాజు ఇప్పటి వరకు వివిధ హోదాల్లో ఉపాధ్యాయ నాయకులుగా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సేవలందించారు. ఈ సందర్భంగా కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఎంపిడిఒ రాజ్‌మనోజ్, ఎంఇఒలు మణికుమార్, నాగేశ్వరరావు, విశ్రాంత మండల విద్యాధికారి లజపతి రాయ్ తదితరులు జయరాజుకు అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల గైర్హాజరు

ప్రజాశక్తి - రాజానగరం

నూతన ప్రభుత్వం ప్రతిష్టాత్మంకగా తొలిసారిగా నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రభుత్వ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి 23 ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు హాజరు కావాల్సి ఉంది. ఆరు ప్రభుత్వ శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మరికొందరు అధికారులు మొక్కుబడిగా కనపడి వెంటనే వెళ్లిపోయారు. ప్రజలకు పూర్తిగా సమాచారం తెలియక పోవడం వల్ల ఈ కార్యక్రమానికి ఒక్క అర్జీ మాత్రమే వచ్చింది. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ ఒక అర్జీ మాత్రమే వచ్చిందని అధికారులు వస్తున్నారని తెలిపారు.



పూర్తిస్థాయిలో అధికారులు లేక బోసిపోయిన వేదిక

ఎంఎల్ఎ ముప్పిడిని కలిసిన వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - చాగల్లు

బ్రాహ్మణగూడెం పిహెచ్‌సి వైద్య సిబ్బంది కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కె.నిశిత బ్రాహ్మణగూడెం పిహెచ్‌సి నూతన భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఎంఎల్ఎను కలిసిన వారిలో డాక్టర్ పిఆర్ఎల్.దేవి, చంద్రబాబు, శ్రవణ్‌కుమార్, వి.పద్మ, ఎ.రామచంద్రరావు, ఎస్.సారమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 24 అర్జీలను స్వీకరించామని కమిషనర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ పిఎం.సత్యవేణి, ఎస్ఇ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జివిఎస్ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

చాగల్లు : తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు అర్జీలను స్వీకరించామని తహశీల్దార్ ఎం.సావిత్రి తెలిపారు. మూడు పెన్షన్లు, రెండు రేషన్ కార్డులు, ఒక డ్రెయినేజీ నిమిత్తం అర్జీలు వచ్చాయన్నారు.

తాళ్లపూడి : తహశీల్దార్ కార్యాలయం సోమవారం పలు శాఖల అధికారులతో కళకళలాడింది. ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహణ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ఉదయమే కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

కొవ్వూరు రూరల్ : సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆరు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన కౌలు రైతు చట్టం రద్దుకు వినతి

చాగల్లు : గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు రైతుల చట్టాన్ని రద్దుచేసి 2011 అధీకృత రైతు చట్టాలను అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని సాగులో 80 శాతాన్ని కౌలు, సన్న, చిన్నకారు రైతులే సాగుచేస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం అదనంగా రుణలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కౌలు రైతు సంఘం పోరాటం ఫలితంగా 2011లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కౌలు రైతు రక్షణ కోసం ఎపి భూతాధీకృత రైతుల చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ చట్టంలో నిబంధనల ప్రకారం అంగీకారంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే గ్రామ సభ నిర్వహించిన కౌలు రైతులను గుర్తించి కార్డులు ఇచ్చే వారన్నారు. దీనికి గత ప్రభుత్వం తిలోదకాలిచ్చిందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట రామనాథం, మురళి, గణపతి తదితరులున్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలానికి చెందిన కొండేవరం ఇందిరా కాలనీకి చెందిన బండి చక్రధర్(26) తన నివాసంలో దూలానికి చీర కట్టుకుని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన ఒక యువతితో 2021 నుంచి పరిచయం.ఉండడం, అప్పట్లో వివాహం కూడా చేసుకున్నారు. యువతి మైనర్ కావడంతో కుమార్తె సంబంధించి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో యువకుడుపై కేసు నమోదు చేయడం, ఇరువురు విరిపోవడం జరిగింది. ఈనెల 16న యువతి పుట్టినరోజు సందర్భంగా చక్రధర్ వెళ్లి కలిశాడు. ఈ నేపథ్యంలోనే ఆ యువతి తనను చక్రధర్ వేధిస్తున్నాడని కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ యువకుడు మనస్థాపానికి గురై సోమవారం చక్రధర్ ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబీకులు తెలిపారు. సంఘటన స్థలానికి పిఠాపురం సిఐ శ్రీనివాస్, ఎస్ఐ స్వామినాయుడు చేరుకున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరిహద్దు తగాదాలో గ్రూపులపై కేసులు

ప్రజాశక్తి - మామిడికుదురు

నగరం గ్రామంలో సరిహద్దు కొబ్బరి చెట్ల విషయమై తగాదా పడిన రెండు కుటుంబాలపై సోమవారం కేసులు నమోదు చేసినట్టు నగరం ఎస్ఐ సురేష్ తెలిపారు. నగరం కొత్త రోడ్డుకు చెందిన వెలుగొట్ల సూర్యకుమారి, వెలుగొట్ల విజయలక్ష్మి భూమి సరిహద్దులోని కొబ్బరి చెట్ల విషయమైయ ఘర్షణ పడ్డారు. గాయాలతో హాస్పిటల్లో చేరి చికిత్స పొందుతున్నారు. గాయపడిన వారి స్టేట్మెంట్స్పై రెండు వర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



రూ.17 లక్షల నకిలీ సిగరెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

విజిలెన్స్ అధికారులు సోమవారం అమలాపురం పట్టణంలో చేపట్టిన దాడుల్లో రూ.17 లక్షల విలువైన నకిలీ సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో మూడు షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, రెవెన్యూ శాఖ, లీగల్ మెట్రోలజీ అధికారులు, కమర్షియల్ టాక్స్ అధికారులతో కలిపి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అమలాపురం పట్టణంలోని గొల్లగూడెం రామకృష్ణ వీధిలోని నిషిక ఎంటర్ప్రైజెస్ను తనిఖీ చేశారు. ఆ షాపులో రూ.14,33,600 విలువైన బ్రాండెడ్ కాని నిషేధిత సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాల కేసులో షాపు యజమాని సంబంధిత వ్యక్తులపై కొట్పా యాక్ట్-2003 కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవుకు చెందిన నున్న వెంకట బుచ్చిరాజు, గుంటూరుకు చెందిన వెంకట్ అనే వ్యక్తి నుంచి సిగరెట్లను సేకరించి ఎస్వీఆర్ఎన్ఎస్ సోబిత్ వారి ద్వారా నిషిక ఎంటర్ప్రైజెస్ వ్యాపార ప్రాంగణంలో ఉంచి రిటైల్గా స్థానిక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. యర్రమిల్లి వారి వీధిలోని వరలక్ష్మి జనరల్ మర్చంట్స్లో బ్రాండెడ్ కాని నిషేధిత సిగరెట్ ప్యాకెట్లు హార్బర్ గోల్డ్, గోల్డ్ ఫిల్టర్, గోల్డ్ విమల్ వంటి రూ.1,09,200 విలువైన సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమాని, సంబంధిత వ్యక్తులపై కోట్పా యాక్ట్-2003 క్రింద క్రిమినల్ కేశారు. స్టాక్కు సంబంధించిన ఖాతాల పుస్తకాలు, కొనుగోలు అమ్మకాల బిల్లులను నిర్వహించడం లేదని జిఎస్టి అధికారులు గుర్తించారు. యర్రమిల్లి వారి వీధిలోని శ్రీదేవి జనరల్ స్టోర్స్లో రూ.1,98,730 విలువైన నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేకున్నారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కెఎస్ఎస్వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిషేధిత సిగరెట్లను నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు పి.ముత్యాల నాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగ వెంకటరాజు, భార్గవ మహేష్, లక్ష్మీనారాయణ, నవీన్ కుమార్, జగన్నాథరెడ్డి, జీవా, లోవరాజు, వలీ, వీరబాబు కిషోర్ పాల్గొన్నారు.

యానాం చేరిన ఫ్రీజర్ బాక్సులు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ బాక్సలు పనిచేయకపోవడంతో ఈ నెల 11న యానాం యువత ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సమస్యపై స్పందించి హోమ్ మంత్రి నమశివాయం, ఆరోగ్య శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో సోమవారం ప్రభుత్వాసుత్రికి నాలుగు ఫ్రీజర్ బాక్సలు చేరుకున్నాయి. ఎంఎల్ఎ అశోక్ కృషితో ఫ్రీజర్ బాక్సులు ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రసాద్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి -కరప

కృష్ణా జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన గొర్రిపూడికి చెందిన గండి ధర్మవరప్రసాద్ కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.ఐదు లక్ష చెక్కును ఎంఎల్ఎ పంతం నానాజీ తనయుడు సందీప్ అధికారులతో కలిసి సోమవారం అందజేశారు. ప్రసాద్ భార్య వరలక్ష్మికి చెక్కును తహశీల్దార్ణ రామకోటేశ్వరరావు, డిటి అనిల్కుమార్, ఆర్ మాచర్రావు అందజేశారు.

ఎనిమిది అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక డివిజన్ పరిధిలోని పలు మండలాలకు సంబంధించి ప్రజల నుంచి 8 అర్జీలు అందాయని ఆర్డిఒ జె.సీతారామారావు తెలిపారు.

ఆదిత్యలో అధ్యాపకులకు నైపుణ్యశిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి


అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

నరారంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ ప్రారంభమైంది. సోమవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా 'పరిశోధకుల కోసం డేటా సైన్స్' అనే అంశంపై అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సిఎస్సి విభాగానికి చెందిన డాక్టర్ ఎ.సతీష్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ని డేటా సైన్స్ రంగానికి ఎలా అనుసంధానం చేస్తారో తగిన ఉదాహరణలతో వివరించారు. మంగళ, బుధవారాల్లో ఐఐఐటి డిఎంలో సిఎస్సి విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు, గురువారం రోజున జరిగే కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటిఆర్ఐ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ హెచ్.రవిశంకర్, శుక్రవారం జరిగే కార్యక్రమంలో ఎన్ఐసి శాస్త్రతవేత్త శంకర సుబ్బారావు మాట్లాడతారు. మొదటి రోజు ముగింపు కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్ ఎస్, డీన్ ఆర్ అండ్ సి డాక్టర్ కెవిఎస్ఆర్.మూర్తి, విభాగాధిపతి డాక్టర్ కె.స్వరూప, కోఆర్డినేటర్ డాక్టర్ టి.ప్రభాకరరావు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

చేపల వేటపై వైసిపి కౌన్సిలర్ల ఆగ్రహం


చేపల వేట పై అధికారులను హెచ్చరిస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్ తాగునీటి చెరువులో చేపల వేట కొనసాగడంపై పలువురు వైసిపి కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పలువురు వైసిపి కౌన్సిలర్లు ఫిల్టర్ బెడ్ చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో చేపల వేట చేపట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో పెద్ద ఎత్తున అతిసార వ్యాధులు ప్రభలుతుంటే చెరువులో నీరు కలుషితం అయ్యేలా చేపలు పట్టడం ఏమిటని కమిషనర్ జె.రామారావును ప్రశ్నించారు. దీంతో చెరువు పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో ఉందని కమిషనర్ చెప్పడంతో కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ ఉబా జాన్మోజస్ మాట్లాడుతూ జిల్లాలో డయేరియా కేసులు పెరుగుతున్నాయని, చెరువులో చేపలవేటను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్కుమార్, మర్రి శేషారావు, వైసిపి నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, చిట్టిమాని శ్రీను, రెడ్డి వాసు, వారా సుధాకర్, కాళ్ళ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యానాం వార్తలు



మునిస్వామికి వినతిపత్రం ఇస్తున్న దినేష్

అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - యానాం

స్థానిక సావిత్రి నగర్లో అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్ధాని దినేష్ కోరారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యానాంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బస్స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా సావిత్రి నగర్, గిరియంపేట, దరియాలతిప్ప, పరంపేట మీదుగా హాస్పిటల్కి వచ్చే వారికి సులువుగా ఉంటుందని తెలిపారు. సమస్యలపై పరిపాలనాధికారి సానుకూలంగా స్పందించారన్నారు.

హుండీల ద్వారా రూ.3.82 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం


నగదును లెక్కిస్తున్న సేవకులు

మరిడమ్మ ఆలయ హుండీలను సోమవారం లెక్కించగా రూ.3,82,695 ఆదాయం సమకూరిందని అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రామమోహన్రావు తెలిపారు. పెద్దాపురం డివిజనల్ ఇన్స్పెక్టర్ చల్లా ఉదయబాబు నాయుడు, ఇఒ సత్యనారాయణల సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ ఆసాధులు, స్వచ్ఛంద సేవకులు, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాదారులపై కలెక్టర్కు ఫిర్యాదు


కలెక్టర్కు సమస్యను వివరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

స్థానిక రమణయ్యపేట పంచాయితీ గైగోలుపాడు కృష్ణాలయానికి చెందిన భూమిని కబ్జా చేసిన వారిపై ఆలయ కమిటి కలెక్టర్కు ఫిర్యాదు చేసింది. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. తూరంగిలో కుందూరు సుబ్బారావు అనే దాత కృష్ణాలాయానికి 30 సెంట్లు భూమి ఇచ్చారని అన్నారు. ఆ భూమిని రాఘవరాజు అనే వ్యక్తి రోడ్డు, డ్రెయిన్, ప్రహరీ గోడను నిర్మించి ఆక్రమించాడని తెలిపారు. తప్పుడు రికార్డులు సృష్టించడానికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఇదే అంశంపై కలెక్టర్, ఇతర రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి ఈనెల 26వ తేదీన సర్వే చేయించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇదిలావుండగా సోమవారం ఆలయ కమిటి సభ్యులు దేవస్థానం భూమిని పరిశీలించగా ప్రహరీ గోడ కట్టివుండటాన్ని గమనించారు. వెంటనే ఎంఎల్ఎ పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంఎల్ఎ సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా తక్షణమే ప్రహరీ గోడ పనులను నిలుపుదల చేయాలని సూచించారు. అలాగే కమిటీ సభ్యులు ఇంద్రపాలెం పోలీస్స్టేషన్లోనూ, పంచాయతీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. వారంతా సానుకూలంగా స్పందించి ఆలయ భూమిని కాపాడుతామని భరోసా ఇచ్చారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మండలంలోని చంద్రమాంపల్లి జడ్పి హైస్కూల్లో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు కోరారు. సోమవారం విద్యార్థులు నిర్వహించిన 'అమ్మకు వందనం'ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గాయత్రి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి కనీసం 10 మంది విద్యార్థులు జూనియర్ కళాశాలలో చేరేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, పేద, అట్టడుగు కుటుంబాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, కొమ్మిరెడ్డి బుజ్జి, తుమ్మల నాని, రేలంగి బుజ్జి, మత్తాల రాజు, ఎగ్గాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృతిరాలి కుటుంబాన్ని ఆదుకుంటాం:చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చినరాజప్ప

అతిసార వ్యాధితో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన జొన్నలదొడ్డికి చెందిన కొమ్మోజు సత్యవేణి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప హామీ ఇచ్చారు. సోమవారం సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు జొన్నలదొడ్డి అతిసారా ప్రబల ప్రాంతంలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. మృతురాలు సత్యవేణి ఇంటికి వెళ్లి వారి కుటుంబీకులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణ, తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. గ్రామస్తులు ఆరోపించిన చెరువులో కాలుష్య జలాలు కలగకుండా డ్రెయినేజీలోకి వెళ్లేలా ప్రత్యేక పైప్ లైన్ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

మరో నాలుగు కేసులు నమోదు

కాగా సోమవారం జొన్నలదొడ్డి ప్రాంతంలో మరో నాలుగు అతిసార కేసులు నమోదైనట్లు వేట్లపాలెం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ఎం.పార్థేష్ చెప్పారు. వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నామన్నారు. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న వారిని చికిత్స నిమిత్తం వేట్లపాలెం పిహెచ్సికి తరలించామన్నారు. ఈ కార్య క్రమంలో కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ జి.పద్మరూప, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, టిడిపి నాయకుడు గుమ్మళ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


చినరాజప్పను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చినరాజప్పను సన్మానించిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక లూథరన్ హైస్కూల్ ఉపాధ్యాయులు సోమవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను పెద్దాపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ, ఉపాధ్యాయోతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, 117 జిఒను రద్దు చేయాలని, 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం ఆపాలని, కెజిబివివి ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకుని వేతనాలు సక్రమంగా ఇవ్వాలని, ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని, పెండింగ్లో ఉన్న నాడు - నేడు పనులను పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.ఫిలిప్రాజ్, మండల అధ్యక్షులు సిహెచ్.విక్టర్ బాబు, ప్రధాన కార్యదర్శి విటివి.ఆచార్యులు పాల్గొన్నారు.

40 మంది విద్యార్థులకు ప్రవేశాలు

ప్రజాశక్తి - సామర్లకోట


చిన్నారులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ

నేను బడికి పోతా కార్యక్రమంలో 40 మంది విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించినట్లు ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం మండలంలోని గొంచాల ఎంపి ఎలిమెంటరీ పాఠశాల, మున్సిపాలిటీ పరిధిలోని కరప చెరువు బివిఆర్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పాఠశాల పరిధిలో ప్రత్యేక ర్యాలీలు చేపట్టి బడి ఈడు గల పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమాలు నిర్వహించారు.

హెచ్ఎంపై ఎంఇఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు


ఎంఇఒకు ఫిర్యాదు చేస్తున్న ఎంపిటిసి, పిఎంసి ఛైర్మన్

తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని హెచ్ఎం నిర్వహించారని సుంకరపాలెం ఎంపిటిసి గుత్తుల శ్రీనివాస్, పిఎంసి ఛైర్మన్ పలివెల రాము ఎంఇఒకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సుంకరపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమాచారాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులకు హెచ్ఎం బి.సునీల్ సమాచారం ఇవ్వలేదంటూ సోమవారం ఎంఇఒకు వారు ఫిర్యాదు చేశారు. ప్రశ్నించిన తమపై పట్ల అవమానకరంగా మాట్లాడారని, హెచ్ఎంపై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. దీనిపై ఎంఇఒ-2 మోకా ఉమా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తామని తెలిపారు.

సిహెచ్సి వైద్యురాలిపై సిబ్బంది ఫిర్యాదు

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలో ప్రధాన ఆసుపత్రి అయిన తాళ్లరేవు సిహెచ్సిలో చిన్నపిల్లల వైద్యురాలు స్నేహలత తీరుపై పలువురు ఆసుపత్రి సిబ్బంది సూపరింటెండెంట్ శిరీషకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా వైద్యురాలు స్నేహలత తమను దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషిస్తున్నారని ఆసుపత్రి ఎన్హెచ్ఎం స్టాఫ్నర్స్ సునీత, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ శాంతి, పిఎం అసిస్టెంట్ శివకుమారి ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతిరోజు అసందర్భంగా రుస రుసలాడుతూ రోగులు ఉండగానే తమపై విరుచుకుపడుతున్నారని వాపోయారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న టెస్టులు సైతం బయట ల్యాబ్లకు రాస్తున్నారని చెప్పారు. వైద్యురాలు స్నేహలత తీరుతో ఆసుపత్రిలో విధులు నిర్వహించలేకపోతున్నామని ఆమెపై తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ శిరీషను వివరణ కోరగా వైద్యురాలు స్నేహలతపై ముగ్గురు మౌఖికంగా ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా వైద్య శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

'ప్రజా సమస్యలను పరిష్కరించాలి'

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపి కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వల్లూరు రాజబాబు కోరారు. సోమవారం పెదపూడి రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో తహశీల్దార్ రాజ్కుమార్కు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీటి, పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. అతిసార వ్యాధులు ప్రభలమవుతున్న నేపథ్యంలో మండలంలో గ్రామాల్లోని పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మడికి సత్యం తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తకుప్పలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలానికి చెందిన చంద్రమాంపల్లి గ్రామంలో అనేక ప్రాంతాల్లో చెత్త పోగులు పేరుకుపోతున్నాయి. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే అతిచార వ్యాధి ప్రబలి మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య నిర్వహణ పట్ల అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే తమ గ్రామంలో కూడా అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేలంగి వెంకట్రావు, ఎన్.శ్రీను, తాతబాబు, దొర తదితరులు మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు వెంటనే స్పందించి తమ గ్రామంలో పేరుకుపోయిన చెత్త పోగులన్నీ తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


గ్రామంలో దుర్వాసన కొడుతున్న పేరుకుపోయిన చెత్త